క్లుప్తంగా

నేడు స్పందన, డయల్ యువర్ కమిషనర్


కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ: ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం 9:30 నుంచి 10:30 వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు తెలిపారు. స్థానిక సమస్యలను కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం ఫోన్ నంబర్ 0884 2357800కు కాల్ చేసి తెలియజేయవచ్చని పేర్కొన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే 10:30 నుంచి స్పందన కార్యక్రమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఆయా కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేదలకు స్వచ్ఛంద సంస్థల ఆసరా


దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి

బోట్‌క్లబ్: సమాజంలో నిరుపేదలకు స్వచ్ఛంద సంస్థలు అండగా నిలుస్తున్నాయని కాకినాడ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం లయన్స్ క్లబ్ కాకినాడ జెమ్స్, ప్రేరణ హెల్పింగ్ హ్యాండ్స్ సహకారంతో దివ్యాంగునికి ట్రై సైకిల్ అందించారు. సమాజంలో అవసరం ఉన్న వ్యక్తులను గుర్తించి, సాయం అందించడం గొప్ప విషయమన్నారు. క్లబ్ మాజీ గవర్నర్ లింగమల్లు కృష్ణమూర్తి మాట్లాడుతూ క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రేరణ హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షులు బాలాజీ మాట్లాడుతూ గత మూడేళ్ల క్రితం ప్రారంభమైన ఈ సంస్థ నేడు వంద మందితో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు మణిబాబు, నరసింహమూర్తి, సాలగ్రామ సర్వేశ్వరరావు, డి.కిరణ్, ఎఎంఎస్ఎన్ మూర్తి, వైదాడి రాజు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన


నృత్య ప్రదర్శన ఇస్తున్న రాజేశ్వరి సాయినాథ్

బోట్‌క్లబ్: సంగీత విద్వత్సభ సంక్రాంతి నృత్యోత్సవాల్లో భాగంగా స్థానిక సూర్యకళా మందిరంలో ఆదివారం రాత్రి డా.రాజేశ్వరి సాయినాథ్ శిష్య బృందంతో చేసిన నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. శామతాకారం భుజగశయనం శ్లోకంతో ప్రారంభించి, నాట్య ప్రదర్శనలో ముఖ్యంగా సింహేమద్ర మధ్యమం రాగంలో వర్ణం నాట్య ప్రియులను ఆకట్టుకుంది. అభేరి రాగంలో నగుమోము గనలేని మొదలైన కీర్తనలకు నృత్యం చేసి ప్రేక్షకుల మన్ననలు పొందారు. తొలుత ఈ నృత్య ప్రదర్శనను ప్రముఖ ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పి రావు, వక్కలంక రామకృష్ణ, డా.ఎస్‌వీ రావు, డా.ముళ్లపూడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీపీఠంలో ప్రత్యేక కార్యక్రమాలు

కాకినాడ రూరల్: అయోధ్యలో రామమందిరం ప్రారంభం సందర్భంగా రమణయ్యపేట శ్రీపీఠంలో పరిపూర్ణనంద స్వామి ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం నుంచి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఐశ్వర్యాంబిక సమేత సుందరేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఈ ఏర్పాట్లు జరిగాయి. శ్రీరాముల వారి కల్యాణం, సామ్రాజ్య పట్టాభిషేకం, పుష్పాభిషేకం, దీపాలంకరణ సేవ నిర్వహించనున్నారు.

వృద్ధులు ఓటీపీ ఎలా చేస్తారు!

కాకినాడ రూరల్: రాష్ట్రంలో కాపులను డి గ్రేడ్ చేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం కుల గణన చేస్తోందని ఆంధ్ర కాపు సద్భావన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసురెడ్డి ఏసుదాసు ఆరోపించారు. ఎన్‌ఎఫ్‌సీఎల్ రోడ్డులో కాపు కల్యాణ మండపంలో ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యావంతులైన యువకులు ఉండరని, వృద్ధులు ఓటీపీ ఎలా చేస్తారని ప్రశ్నించారు.

పెంకుటిల్లు దగ్ధం

కోటనందూరు: మండలంలోని భీమవరపుకోట మాదిగపేటలో ఆదివారం తెల్లవారుజామున ఓ పెంకుటిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన శీలి దుర్గాభవానీ తన పెంకుటింట్లో వంట చేస్తుండగా మంటలు చెలరేగి ఇంటికి నిప్పంటుకుంది. టీవీ, ఫ్రీజ్, వాషింగ్ మెషీన్, డైనింగ్ టేబులతో పాటు నిత్యావసరాలు కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.2 లక్షల ఆస్తినష్టం సంభవించినట్టు బాధితులు తెలిపారు. వీఆర్వో సత్తిబాబు సంఘటన స్థలాన్ని పరిశీలించి, బాధితులకు 10 కేజీల బియ్యం అందజేశారు.

గుర్తుకొస్తున్నాయ్..

- 1976–77 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం
- 47 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై..
- ఎంఎస్ఎన్ చార్టీస్‌లో అపూర్వ ఘట్టం


ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు

కాకినాడ సిటీ: అందరి కళ్లలో చెప్పలేని ఆనందం. వారి ఆనందానికి అవధుల్లేవు. ఎవరిని పలకరించినా ఉద్వేగమే. ఆ క్షణాన కుటుంబ సమస్యలు, వృత్తి, ఇతరత్రా ఇబ్బందులేమీ గుర్తులేవు. అందరూ ఆప్యాయంగా పలకరించుకున్నారు. నువ్వేం చేస్తున్నావ్.. నువ్వెక్కడున్నావ్.. ఇలా ఆత్మీయంగా ఒకరి గురించి మరొకరు ఆరాతీసుకున్నారు. నాలుగున్నర దశాబ్దాల పైచిలుకు అపూర్వ ఘట్టానికి వేదికైంది కాకినాడ మల్లాడి సత్యలింగం నాయకర్ ఛారిటీస్ హైస్కూల్. ఆదివారం ఇక్కడ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది.

కాకినాడ ఎంఎస్ఎన్ చార్టీస్ ఉన్నత పాఠశాలలో 1976–77లో పదో తరగతి పూర్వ విద్యార్థులంతా కలిసి అదే స్కూల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. సుమారు 60 రోజుల నుంచి వివిధ ప్రాంతాల్లో ఉన్న వారికి సమాచారం అందించి, వారిని ఆహ్వానించారు. సెలవు రోజైనా.. ఆదివారం ఉదయం సుదూర ప్రాంతాల నుంచి భార్యాపిల్లలతో కాకినాడ జగన్నాథపురంలోని ఎంఎస్ఎన్ చార్టీస్‌కు చేరుకున్నారు. వివిధ రంగాల్లో ఉన్న సుమారు 47 ఏళ్ల క్రితం నాటి చిన్ననాటి మిత్రులు అంతా ఒకే చోటుకు చేరుకున్నారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఎంతో ఆనందంగా గడిపారు. పాఠశాల అభివృద్ధి కోసం ప్రణాళిక రూపొందించారు. పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన గింజల అంజలి, బి ప్రదీప్తి అనే విద్యార్థులకు రూ.ఐదు వేల చొప్పున పారితోషకం అందజేశారు. ఆదం గోవిందరావు, గుత్తుల రమణ, నిమ్మ రాజుబాబు, జీవీ వీరభద్రరావు, శీరం నాగేంద్రకుమార్, కర్నాకుల సూర్యనారాయణ, సుశీలతో పాటు అమెరికా, కోల్‌కత, ఢిల్లీ, మహారాష్ట్ర, హైదరాబాద్, విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి శంభూప్రసాద్, ఎంవీఎస్ఎన్ రాజు, అరుణకుమారి, మామిడి తాతారావు, సూర్యభాస్కరరెడ్డి, వాడపల్లి సత్యనారాయణ, కరప తహసీల్దార్ పొన్నమండ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఆనాటి అల్లరి జ్ఞప్తికి..



చదువుకునే రోజుల్లో తరగతి గదుల్లో ఆడిన ఆటలు, పాడిన పాటలు, చేసిన అల్లర్లను చిన్ననాటి స్నేహితులతో కలిసి పంచుకోవడం ఎంతో సంతృప్తినిచ్చింది. ఆ ఆనందం ఎక్కడా దొరకదు.

– సుశీల, కాకినాడ

రెండు నెలల నుంచి కష్టపడ్డాం



స్నేహితులతో కలిసి సుమారు రెండు నెలల కష్టపడి అందరి నంబర్లు సేకరించి, ఈ సమ్మేళనం నిర్వహించాం. ఇది నిజంగా మరిచిపోలేని రోజు. చాలా ఆనందంగా ఉంది.

– ఆదం గోవిందరావు, పూర్వ విద్యార్థి, కాకినాడ

మరువలేనిది



ఇలా కలుసుకోవడం మిత్రుల్లో ఐక్యతను తీసుకొచ్చింది. మాలో ఏ ఒక్క మిత్రుడికి కష్టం వచ్చినా అందరం కలిసి ఆదుకుంటాం. నిజంగా ఈ రోజు మరచిపోలేనిది.

– గుత్తుల రమణ, పూర్వ విద్యార్థి, జగన్నాథపురం, కాకినాడ

ఎంతో ఆనందంగా ఉంది



ఇన్నేళ్లకు చిన్ననాటి స్నేహితులను కలుసుకోవడం నిజంగా మరచిపోలేని అనుభూతి. అప్పటి అల్లర్లు, జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నాం. మళ్లీ చదువుకున్నట్టు అనిపించింది.

– నిమ్మ రాజబాబు, పూర్వ విద్యార్థి

శెట్టిబలిజలు రాజకీయంగా ఎదగాలి


ప్రభుత్వ ఏజీపీ గెద్దాడ వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న శెట్టిబలిజ సంఘ సభ్యులు

కాకినాడ సిటీ: శెట్టిబలిజ కులస్తులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఉందని, అదే విధంగా పిల్లలను ఉన్నత చదువు చదివించేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలని కాకినాడ సాంబమూర్తినగర్ కౌండిన్య శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు కాకరపల్లి చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం సాయంత్రం సాంబమూర్తినగర్‌లో కౌండిన్య శెట్టిబలిజ దశమ వార్షికోత్సవ సభలో ఆయన మాట్లాడారు. కులస్తులు గుర్తించబడాలంటే రాజకీయ ఎదుగుదల అవసరమన్నారు. సిటీ శెట్టిబలిజ భవనం కోసం కులస్తులంతా కృషి చేద్దామన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిని కలిసి సంఘానికి సొంత భవనం కోసం కోరాలని సమావేశం నిర్ణయించింది. ఈ సందర్భంగా ప్రభుత్వ ఏజీపీగా పని చేస్తున్న గెద్దాడ వెంకటేశ్వరరావు, సీఐడీ పీపీ పిల్లి శ్రీనివాసరావు, కార్మిక సంఘం నాయకులు పితాని నూకరాజును సంఘ ప్రతినిధులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా శెట్టిబలిజ గౌరవ అధ్యక్షుడు రెడ్డి పల్లంరాజు, సంఘం గౌరవాధ్యక్షులు చింతాకుల శ్రీనివాస్, నాయకులు కుడుపూడి వీరభద్రరావు, కడియాల సూరిబాబు, పాలిక లోవరాజు, పెంకే నాగేశ్వరరావు, రాయుడు దుర్గ, బొందల నూకరాజు, నాగుల రాజు తదితరులు పాల్గొన్నారు.

'మాకిష్టం సండే స్టోరీ టైం'


మాకిష్టం సండే స్టోరీ టైంలో పాల్గొన్న విద్యార్థులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక వివేకానంద పార్కు ఆవరణలో గాంధీనగర్ శాఖ ఆదివారం మాకిష్టం సండే స్టోరీ టైం కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఎస్ రామ్‌చరణ్ బేతాళ కథలు అనే కథను, కె కీర్తి హితోపదేశ అనే పుస్తకాన్ని, కె.సూర్యవరుణ్ బాలల పంచతంత్ర కథల పుస్తకాలు చదివారని లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ ఐవీ రావు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): డాక్టర్ బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత జనరల్ వైద్య శిబిరం ల్యాబ్ ఆవరణలో నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ మాజీ వీసీ డాక్టర్ ఐవీ రావు ప్రారంభించారు. ఇలాంటి వైద్య శిబిరాలు ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడానికి దోహదపడతాయన్నారు. వైద్యులు ఎంబీఆర్ శర్మ, రామ్‌స్వరూప్, కళాసాగర్, బాదం దాశరథి సేవలందించారు. మొత్తం 255 మందికి పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు.

నేడు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

- సీనియర్ ఐఏఎస్ పీయూష్ కుమార్ రాక
- కమిషనర్ నాగనరసింహారావు వెల్లడి


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ నాగనరసింహారావు, ఇతర అధికారులు

కాకినాడ: ప్రధాని మోడీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పేరిట అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు చెప్పారు. స్థానిక వివేకానంద పార్క్ ఆవరణలోని రాగిరెడ్డి కళాక్షేత్రంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ ఏర్పాట్లను వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో కలిసి కమిషనర్ నాగనరసింహారావు ఆదివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కామర్స్ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి, ఐఏఎస్ అధికారి పియూష్ కుమార్, ఎంపీ వంగా గీత విశ్వనాథ్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతున్నారన్నారు. కేంద్రం అమలు చేస్తున్న వివిధ పథకాల స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. లబ్ధిదారులు కూడా పాల్గొని, తమ మనోగతాన్ని వెల్లడిస్తారన్నారు. దాదాపు 15 కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి అధికారులు సమగ్ర సమాచారంతో హాజరు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రమణారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగేశ్వర్ నాయక్, గృహ నిర్మాణ శాఖ డీఈ సత్యనారాయణ రెడ్డి, స్మార్ట్ సిటీ ఎస్ఈ పి.వెంకటరావు, ఈఈ మాధవి, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, ఏసీపీ నాగశాస్త్రులు, టీపీఆర్ఓ మానే కృష్ణమోహన్, సిటీ మిషన్ మేనేజర్ దేగల వెంకటరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దళిత జాతి గర్వించదగ్గ నేత జగన్

రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి బత్తుల భీమారావు


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన ఎస్సీ సెల్ ప్రతినిధులు

కాకినాడ: విజయవాడ నడిబొడ్డున భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహం స్మృతి వనం ఏర్పాటు చేయటం ద్వారా లక్షలాది మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దళిత వర్గాల గుండెల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిరస్థాయిగా నిలిచారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి బత్తుల భీమారావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఎస్సీ సెల్ ముఖ్యనేతల సమావేశం జరిగింది. తొలుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఎస్సీ సెల్ ప్రతినిధులు క్షీరాభిషేకం చేశారు. సమావేశంలో భీమారావు మాట్లాడుతూ స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్ పేరుతో అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని, స్మృతి వనాన్ని దళిత జాతికి అంకితమిచ్చిన ముఖ్యమంత్రి.. విజయవాడ పేరును ప్రపంచ పటంలో నిలిపారన్నారు. విజయవాడ అంటే కొండపై అమ్మవారు, కొండ కింత అంబేడ్కర్ అన్న రీతిలో పర్యాటకులను సైతం ఆకర్షించే విధంగా స్మృతి వనాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దారన్నారు. లక్షలాది మంది అంబేడ్కర్ వాదులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల సమక్షంలో విగ్రహాన్ని జాతికి అంకితం చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర చరిత్రలో దళిత జాతి గుండెల్లోను, దళిత బాంధవునిగా చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. చక్కని కార్యక్రమాన్ని వీక్షించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసిన కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్‌కుమార్, ఎస్సీ సెల్ ప్రతినిధులు బళ్ల సూరిబాబు, రెడ్డి భీమా, సిద్ధాంతం రాజు, కొండేపూడి రవి, ఎం మూర్తి, ఎం ఉదయ్‌కుమార్, పోలినాటి సుధాకర్, డి వరప్రసాద్, ఎం డేవిడ్, దీపక్, బత్తిన రాజు, సారథి, అంజిబాబు, సాపే సుధాకర్, నందకుమార్, ఆనంద్, సత్యనారాయణ, అనిల్, పెద్ద సంఖ్యలో ఎస్సీ సెల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నగరంలో వైభవంగా శోభాయాత్ర


గాంధీనగర్‌లో శోభాయాత్ర చేస్తున్న మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి


అక్షింతలు పంపిణీ చేసిన ఆరోగ్య భారతి వైద్యులు

బోట్‌క్లబ్: అయోధ్యలో శ్రీరామచంద్రుని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా 41వ డివిజన్ మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి ఆధ్వర్యంలో శోభా యాత్ర నిర్వహించారు. స్థానిక వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం వద్ద నుంచి వెంకటనారాయణ వీధి మీదుగా, ఒంటిమామిడి జంక్షన్, గాంధీనగర్, రైతుబజార్ మీదుగా శోభా యాత్ర కొనసాగింది. రామనామ సంకీర్తనలు, భజనలు, హనుమాన్ చాలీసా పారాయణలు చేశారు. అయోధ్య అక్షింతలను భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో దువ్వూరి సుబ్రహ్మణ్యం, తిరువూరి వీరేష్ ప్రసాద్, గరిమెళ్ల అన్నపూర్ణ శర్మ తదితరులు పాల్గొన్నారు. ఆర్‌ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్థానిక అయ్యప్పస్వామి ఆలయం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు.

రాంకోసా మైదానంలో ఆరోగ్య భారతి వైద్యుల ఆధ్వర్యంలో ఆదివారం రాముని అక్షింతల వితరణ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముఖ్యఅతిథి డా.జీఎస్ మూర్తి, డా.చిట్ల కిరణ్, డా.అడ్డాల సత్యనారాయణ మాట్లాడారు. వైద్యులు లక్ష్మీనారాయణ, చక్రపాణి, రాజ్యలక్ష్మి, ఉమ, ఆదిత్య, శిరంగు దొరబాబు పాల్గొన్నారు.

విప్లవ నేత లెనిన్‌కి ఘన నివాళులు


లెనిన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కాకినాడ సిటీ: లెనిన్ మార్క్సిస్టు సిద్ధాంతాన్ని నిర్దిష్ట పరిస్థితుల్లో, నిర్దిష్టంగా అమలు చేయడం ఎలాగో కార్మిక వర్గానికి బోధించి, ప్రపంచంలోనే తొలి సోషలిస్టు విప్లవాన్ని సాధించారని వక్తలు పేర్కొన్నారు. సోషలిస్టు మహా విప్లవ నేత వీఐ లెనిన్ శత వర్ధంతి సభ ఆదివారం కాకినాడలో సుందరయ్య భవన్‌లో కె.వీరబాబు అధ్యక్షతన జరిగింది. సీపీఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, సీనియర్ నాయకులు దువ్వా శేషుబాబ్జీ మాట్లాడుతూ మార్క్స్, ఎంగెల్స్ తర్వాత మార్క్సిస్టు మహోపాధ్యాయునిగా లెనిన్ చరిత్రలో చిరస్థానం సంపాదించారన్నారు. సీపీఎం నాయకులు పలివెల వీరబాబు, తిరుమలశెట్టి నాగేశ్వరరావు, ఆర్‌పీఐ నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు తదతరులు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్ రమణి, కె సింహాచల, సీహెచ్ అజయ్‌కుమార్, టి రాజా, మేడిశెట్టి వెంకట రమణ, జుత్తుక శ్రీనివాసరావు, ఈశ్వరి, వేణి తదితరులు పాల్గొన్నారు.

ఏటిమొగ యూత్ డెవలపర్స్ కృషి అభినందనీయం


విద్యార్థులకు మెటీరియల్ అందజేస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ: అగ్నికుల క్షత్రియ యువతీ, యువకులు విద్యలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు ఏటిమొగ యూత్ డెవలపర్స్ చేస్తున్న కృషి అభినందనీయమని అగ్నికుల క్షత్రియుల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అద్దంకి వెంకన్నబాబు అన్నారు. ఆదివారం పదో తరగతి, ఇంటర్మీడియట్ చదువుతున్న అగ్నికుల క్షత్రియ విద్యార్థులు సుమారు 400 మందికి సిలబస్ మెటీరియల్, ఎగ్జామ్స్ కిట్స్, బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఏ అవసరం వచ్చినా తమ ఉద్యోగ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో పరిష్కరించే చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఉమెన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ చింతా నారాయణమూర్తి, కోనసీమ జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ కర్రి భీమేశ్వర్, ఇరిగేషన్ ఏఈ పాలెపు వీరబాబు, ఎస్సై ట్రైనింగ్ పొందుతున్న కాలాడి రాజు, ఉపాధ్యాయుడు పేమ్మాడి సంతోష్ తదితరులు విద్యార్థులకు అనేక మెళకువలను వివరించారు.

బోనం సమర్పయామి..!


నల్లగొండమ్మతల్లి ఆలయానికి బోనాలతో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

- కన్నులపండువగా నల్లగొండమ్మ తల్లి బోనాల సంబరం
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు


ప్రత్యేక అలంకరణలో నల్లగొండమ్మ తల్లి


భరత నాట్యం చేస్తున్న చిన్నారులు

తుని రూరల్: ఎస్.అన్నవరం శివారు వేంపాడు మెట్ట వద్ద కొలువైన నల్లగొండమ్మతల్లి బోనాల మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. స్థానిక రామాలయం వద్ద వేలాది మంది బోనాలను శిరస్సున ధరించి ఊరేగింపును ప్రారంభించారు. శ్రమదానం రోడ్డుమీదుగా కొత్త సూరవరం, తుని పట్టణం, ఎస్.అన్నవరంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం మీదుగా ఊరేగింపు ఆలయానికి చేరుకుంది. పెద్దసంఖ్యలో మహిళలు, యువతులు బోనాలను శిరస్సుపై ధరించి భక్తిశ్రద్ధలతో నల్లగొండమ్మతల్లి నామస్మరణ చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు సాంప్రదాయ కొమ్ము, థింసా నృత్యాలను ప్రదర్శించారు. ఎస్.అన్నవరం, తుని పరిసర ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. అనంతరం అమ్మవారి తీర్థం అంగరంగవైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చిన్నారుల సంప్రదాయ భరతనాట్య నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ ప్రెసిడెంట్ వంగలపూడి దొరబాబు, కార్యదర్శి వంగలపూడి ఫణి, కోశాధికారి వంగలపూడి జమీలు, నాయకులు వంగలపూడి మహేష్, వంగలపూడి బుజ్జి, కాంతారావు, గోవిందుబాబుతదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉద్దేశపూర్వకంగా తప్పుడు ఫిర్యాదు

కాకినాడ రూరల్: తనపై తప్పుడు ఫిర్యాదు చేసి కక్ష సాధింపునకు పాల్పడుతున్నట్టు వలసపాకల గ్రామానికి చెందిన వ్యక్తిపై పంచాయతీ కార్యదర్శి అహ్మద్ ఉన్నీసా బీబీ ఆరోపించారు. ఇంటి పన్ను విషయమై తనకు సొమ్ము ఇచ్చినట్టు జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేయడంపై ఆదివారం ఆమె స్పందించారు. పాలిక పద్మావతికి రూ.10500కు రసీదు ఇచ్చామన్నారు. తనపై అభియోగంలో వాస్తవం లేదని, పంచాయతీకి జమ చేయాల్సిన నగదు మాత్రమే తీసుకుని రసీదు ఇచ్చామన్నారు. గతంలో తనపై దురుసుగా ప్రవర్తించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశామని, అది దృష్టిలో పెట్టుకుని తప్పుడు ఆరోపణలు చేస్తున్నట్టు చెప్పారు. యాదవపేటలో పంచాయతీ స్థలంలో ఇల్లు నిర్మించుకోవడంతో, ఆ ఇంటికి పన్ను కట్టించుకోవడం లేదని, దీంతో కక్ష సాధింపునకు పాల్పడుతున్నట్టు మీడియాకు వివరించారు.